సాక్షి
కామారెడ్డి
మంగళవారం : 20 : ఫిబ్రవరి : 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణిలో 65 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇందులో 27 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవే కావడం గమనార్హం.

- 8లో ▸



కమీషన్ల కోసం..

కేసీఆర్ కుటుంబం కమీషన్ల కోసం కక్కుర్తిపడడం వల్లే 'కాళేశ్వరం' పనుల్లో నాణ్యత లోపించిందని జుక్కల్ ఎమ్మెల్యే ఆరోపించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.6 /15.5

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగవచ్చు. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా శ్రీహరిరాజు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా శ్రీహరి రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జగ్జీవన్ సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నుంచి శ్రీహరిరాజు బదిలీపై వచ్చారు. బల్దియా అభివృద్ధికి కృషి చేస్తానని శ్రీహరి రాజు పేర్కొన్నారు.

నేడు 'కేవీ' భవనాన్ని ప్రారంభించనున్న ప్రధాని



నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో నిర్మించిన కేంద్రీయ విద్యాలయం నూతన భవనాన్ని మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి కేంద్రం రూ. 22కోట్లు మంజూరు చేయగా రాష్ట్ర ప్రభుత్వం నగర శివారులోని రఘునాథ చెరువు సమీపంలో ఏడు ఎకరాల స్థలం కేటాయించింది. 2019 అక్టోబర్‌లో నిర్మాణానికి భూమిపూజ చేశారు. దాదాపుగా నాలుగేళ్ల తర్వాత నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవ కార్యక్రమం ఉదయం 11 గంటలకు మొదలవనుంది. కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎంపీ ధర్మపురి అర్వింద్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పాల్గొననున్నారు.

నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ రాక వాయిదా

బోధన్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్(ఎన్డీఎస్ఎల్) పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ప్రతినిధుల బృందం రాక వాయిదా పడింది. బోధన్, ముత్యంపేట (జగిత్యాల), ముంబోజిపల్లి (మెదక్) ఎన్డీఎస్ఎల్ యూనిట్లను తెరిపించేందుకు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్‌గా, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కో–చైర్మన్‌గా, బోధన్, మెదక్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలతో పాటు మరో నలుగురు ఉన్నతాధికారులను సభ్యులుగా కమిటీని వేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ మంగళవారం బోధన్ ఫ్యాక్టరీ సందర్శనకు రావాల్సి ఉంది. ఇందుకోసం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఏర్పాటు సైతం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో కార్యక్రమం వాయిదా పడింది. కమిటీ రాక మళ్లీ ఎప్పుడు ఉంటుందనే విషయంలో స్పష్టతలేదు.

'హైకోర్టు తీర్పు అమలు చేస్తాం'

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అవిశ్వాస తీర్మానం వ్యవహారం హైకోర్టు జోక్యంతో కొలిక్కి వస్తోంది. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు కూడా చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించడానికి న్యాయమూర్తి ఎదుట సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అధికారులు అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించినా.. స్పష్టత ఇవ్వక పోవడంతో కారణంగా సమస్య హైకోర్టుకు చేరింది. ఈ నెల 10న హైకోర్టు న్యాయమూర్తి రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ నెల 19లోగా చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించాలని ఆదేశించారు. అయినా ఎన్నిక నిర్వహణలో ఆలస్యం జరుగుతుండడంతో సోమవారం కేసు మళ్లీ న్యాయమూర్తి ముందుకెళ్లింది. స్పష్టమైన ఆదేశాలిచ్చినా ఎన్నిక నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ కోర్టుకు తెలిపారు. కోర్టు సూచనలు పాటిస్తూ ఎన్నిక నిర్వహిస్తామని అంగీకరించడంతో న్యాయమూర్తి ఎన్నికల కమిషన్ అధికారులకు సైతం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. మరోవైపు వైస్‌చైర్మన్‌కు చైర్మన్‌గా అదనపు బాధ్యతలు ఇవ్వాలని వైస్‌చైర్మన్ మున్ను వేసిన కేసు సైతం హియరింగ్‌కి రావడంతో ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కాగానే అదనపు బాధ్యతలు ఇస్తారని న్యాయమూర్తి సూచించారు. దీంతో వినీత వర్గీయులకు చుక్కెదురైనట్లయ్యింది.

జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మెటర్నిటీ వార్డులో బాలింతలు



ఏళ్లుగా ఎదురుచూపులే..

- గర్భిణులు, బాలింతలను పట్టించుకోని సర్కారు
- నాలుగేళ్లుగా ఖాతాల్లో జమకాని కేసీఆర్ కిట్ డబ్బులు
- న్యూట్రిషన్ కిట్‌లదీ అదే దారి..

మాతా శిశుమరణాలను తగ్గించడం, పోషకాహార లోపాన్ని నివారించడం, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాల లక్ష్యం నీరుగారుతోంది. నెలలుగా న్యూట్రిషన్ కిట్‌లు రావడం లేదు. కేసీఆర్ కిట్ డబ్బుల కోసం నాలుగేళ్లుగా అర్హులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

కామారెడ్డి టౌన్ : మాతామరణాల రేటును తగ్గించడంతోపాటు సర్కారు దవాఖానాల్లో ప్రసవాలను పెంచడం కోసం గత ప్రభుత్వం కేసీఆర్(ఎంసీహెచ్) కిట్ పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం కింద నాలుగు విడతల్లో గర్భిణులు, బాలింతల బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ చేస్తారు. ఆడబిడ్డ పుడితే రూ.13 వేలు, బాబు పుడితే రూ.12 వేల ఆర్థిక సాయం అందుతుంది. గర్భిణీగా నమోదు, ఏఎన్‌సీ చెకప్, సర్కారు దవాఖానాలో ప్రసవం, పిల్లలకు మూడు నెలల టీకా వేయించినప్పుడు.. ఇలా నాలుగు విడతల్లో అందిస్తారు. ప్రసవం అయిన రోజునే శిశువుకు, బాలింతకు కావాల్సిన సామగ్రితో కేసీఆర్ కిట్ బ్యాగ్ కూడా అందిస్తారు. పథకాన్ని ప్రారంభించిన రెండేళ్ల వరకు సక్రమంగానే గర్భిణుల ఖాతాలలో డబ్బులు జమయ్యాయి. కానీ నాలుగేళ్లుగా సర్కారు నిధులు విడుదల చేయకపోవడంతో పథకం లక్ష్యం నీరుగారిపోతోంది.



కేసీఆర్ కిట్ అందుకుంటున్న బాలింత(ఫైల్)

జిల్లాలో 60 వేలమంది..

జిల్లాలో 2020 ఏప్రిల్ నుంచి కేసీఆర్ కిట్(ఎంసీహెచ్) డబ్బులు అందడం లేదు. జిల్లాలో ఏటా 15 వేల మందికిపైగా గర్భిణులుగా నమోదవుతున్నారు. ఏఎన్ఎంలు వీరి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నా.. సర్కారు నిధులు విడుదల చేయకపోవడంతో పెండింగ్‌లోనే ఉంటున్నాయి. నాలుగేళ్లలో సుమారు 60 వేల మందికి డబ్బులు రావాల్సి ఉంది.

న్యూట్రిషన్ కిట్‌లు..

గర్భిణుల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్ పథకాన్ని తీసుకువచ్చింది. ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలతో కూడిన పదార్థాలను ఈ కిట్‌లో గర్భిణులకు అందిస్తారు. దీనిని గర్భిణులకు రెండుసార్లు (5, 9 నెలలలో) అందించాలన్నది లక్ష్యం. 2022 డిసెంబర్ 21న అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కామారెడ్డిలోనే వర్చువల్‌గా ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలో ఆదినుంచి జాప్యం జరుగుతూనే ఉంది. గర్భిణులకు సరిపడా కిట్‌లను పంపించకపోవడంతో పథకం అభాసుపాలయ్యింది. జిల్లాలో మొదటి దఫాకు సంబంధించి 9 వేల మందికి, రెండో దఫాకు సంబంధించి 6 వేల మందికి న్యూట్రిషన్ కిట్‌లు అందించాల్సి ఉంది. కాగా నాలుగు నెలలుగా న్యూట్రిషన్ కిట్‌లే రావడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం స్పందించి ఈ రెండు పథకాల అమలుకు నిధులు విడుదల చేయాలని గర్భిణులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసీఆర్ కిట్ డబ్బులు, న్యూట్రిషన్ కిట్‌లకు సంబంధించిన వివరాలను గతంలోనే ఉన్నతాధికారులకు నివేదించాం. ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల వివరాలను నమోదై ఉన్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయి. న్యూట్రిషన్ కిట్‌లు రాగానే సరఫరా చేస్తాం.

– లక్ష్మణ్ సింగ్, డీఎంహెచ్‌వో, కామారెడ్డి

పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పాటిల్, జిల్లా అధికారులు

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి
- వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

కామారెడ్డి క్రైం: ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలన్నారు. సోమవారం ఆయన హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న ఫారం 6, ఫారం 7, ఫారం 8 దరఖాస్తులను రోజువారీగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించాలన్నారు. కొత్తగా నమోదైన ఓటర్లకు గడువులోగా గుర్తింపు కార్డులు అందేలా చూడాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అన్ని కళాశాలల్లో స్పెషల్ క్యాంపెయిన్ చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, చేపడుతున్న చర్యలకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టాలి

కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకునే యువత నుంచి కూడా ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. జాబితాలో మార్పులు, చేర్పులు, మృతి చెందిన ఓటర్ల పేర్ల తొలగింపులో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మనుచౌదరి, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, కామారెడ్డి ఆర్డీవో రంగనాథ్, ఎన్నికల విభాగం అధికారులు ప్రేమ్‌కుమార్, అనిల్ కుమార్, వెంకటేశ్వర్లు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

కామారెడ్డి టౌన్: గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వేతనాలను వెంటనే చెల్లించాలని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు బాలనర్సు, నాయకులు రాజయ్య, శ్యాం, స్వామి, రవి, ప్రవీణ్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

ఖిల్లా రామాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో సీతారామచంద్ర స్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు ఆలయ ప్రధానార్చకులు సుమిత్ శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, అంకురార్పణం, ముత్సంగ్రహణం, అఖండ దీపారాధన, రక్షాబంధనం, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్త, ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, డైరెక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్, వీడీసీ సభ్యులు వారాల సాయిలు, తోట చిన్న సాయిలు, తాజా మాజీ సర్పంచ్ గడ్డం రాధ కిష్టారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేద పండితులు, భక్తులు

రక్తదానానికి ముందుకు రావాలి





బిచ్కుందలో రక్తదానం చేస్తున్న మహిళలు, రక్తదానానికి పేర్లు నమోదు చేసుకుంటున్న మహిళలు



కలెక్టర్‌ను కలిసి సమస్యలు వివరిస్తున్న ప్రజలు

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- మహిళలు రక్తదానానికి ముందుకు రావడంపై హర్షం

బిచ్కుంద: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. సోమవారం బిచ్కుంద ప్రభుత్వ ఆస్పత్రిలో నరేంద్ర మహరాజ్ భక్తజన, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో రక్తదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 12 మంది మహిళలు, 102 మంది పురుషులు రక్తదానం చేశారు. 110 మందికి రక్త, వైద్య పరీక్షలు చేసి, అవసరమైనవారికి మందులు అందించారు. కలెక్టర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువకులు, మహిళలు రక్తం ఇవ్వడానికి ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను ప్రశంసించారు.

వైద్యులను నియమించాలి

అన్ని హంగులతో నిర్మించిన వంద పడకల బిచ్కుంద ఏరియా ఆస్పత్రిలో ఒక్క వైద్యుడు కూడా లేకపోవడంతో రోగులకు వైద్య సేవలు అందడం లేదని ప్రజలు కలెక్టర్‌తో పేర్కొన్నారు. ఇన్‌చార్జి వైద్యుడు వారంలో రెండు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారన్నారు. వెంటనే వైద్యులను నియమించాలని కోరారు. స్పందించిన కలెక్టర్.. ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలు, డెలివరీ కేసుల వివరాలు తెలుసుకుని అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని వేళలా వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, వైద్యుడు విక్రం, రెడ్‌క్రాస్ సొసైటీ మండల కన్వీనర్ కోలావర్ శివకుమార్, సభ్యులు శివకాంత్, దస్తీరాం, రమణ, బస్వరాజ్, సొసైటీ చైర్మన్ బాలు, నాయకులు రాజు, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ప్రాచీన కట్టడాలను పరిరక్షించాలి



ఎల్లారెడ్డిరూరల్: ప్రాచీన కట్టడాలను పరిరక్షించడం మనందరి బాధ్యత అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని రామాలయం ఆవరణలో గల మెట్ల బావిని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీన కట్టడాలను పరిరక్షించి వాటిని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రామాలయం ఆవరణలో గల మెట్ల బావిలోని పాదలను తొలగించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. బావికి సంబంధించిన వివరాలతో నివేదిక అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బావి పునరుద్ధరణతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వాసంతి, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలపై మృత్యుఘోష

- మూడేళ్లలో 105 మంది మృతి
- ఆత్మహత్యలే అధికం
- ఫెన్సింగ్ లేక ప్రమాదాల్లో మరికొందరి మృత్యువాత



కామారెడ్డి క్రైం : రైలు పట్టాలపై మృత్యుఘోష వినిపిస్తోంది. మూడేళ్లలో 105 మంది రైళ్ల కింద పడి మరణించారు. ఇందులో ఎక్కువమంది బలవన్మరణానికి పాల్పడినవారే.. పట్టాలపై ప్రమాదవశాత్తు మరణాలూ సంభవిస్తున్నాయి. ఆత్మహత్యలు, ప్రమాదాల నివారణకు రైల్వే శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల కారణంగా క్షణికావేశంలో కొందరు అర్ధంతరంగా తనువు చాలించాలనుకుంటున్నారు. ఆలోచనలు మృత్యువువైపు సాగుతుండగా.. రైలు పట్టాలవైపు నడుస్తున్నారు. కామారెడ్డి రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మూడేళ్లలో 105 మంది రైలు పట్టాలపై తనువు చాలించారు. 2021లో 35 మంది, 2022లో 26 మంది, 2023లో 35 మంది, 2024లో ఇప్పటివరకు 9 మంది పట్టాలపై మరణించారు. ఇందులో 90 శాతం మరణాలు ఆత్మహత్యలే కావడం గమనార్హం. కొందరు ప్రమాదవశాత్తు రైళ్ల కింద పడి మృత్యువాతపడుతున్నారు.

దృష్టి సారించని రైల్వేశాఖ..

కామారెడ్డి రైల్వే పోలీస్ స్టేషన్ పరిధి విశాలంగా ఉంది. పీఎస్ పరిధిలో మొత్తం 17 రైల్వే స్టేషన్‌లున్నాయి. కామారెడ్డి నుంచి మొదలుకొని మనోహరాబాద్ వరకు 13 రైల్వే స్టేషన్‌లు ఉండగా.. అక్కడి నుంచి సిద్దిపేట వరకు ఇటీవలే కొత్త లైన్‌ను ప్రారంభించారు. ఈ లైన్‌లో మరో 4 రైల్వే స్టేషన్‌లున్నాయి. ఈ రైలు మార్గంలో క్రమం తప్పకుండా ఆత్మహత్యలు, ప్రమాదాల ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా స్టేషన్‌ల పట్టణాలు, గ్రామాల పరిధిలో రైలు పట్టాల పక్కన ఎక్కడ కూడా ఫెన్సింగ్ లేదు. గతంలో చాలాసార్లు రైల్వేశాఖ ఉన్నతాధికారులతో ఫెన్సింగ్ ఏర్పాటు విషయంలో చర్చలు జరిగాయి. కానీ నిధులు మంజూరు కాకపోవడంతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే రైలు పట్టాలపై ప్రమాదవశాత్తూ సంభవించే మరణాలు తగ్గే అవకాశాలున్నాయి.

కామారెడ్డిలోని జీడీ వర్కర్స్ కాలనీకి చెందిన హరీష్ కుమార్ (24) అనే యువకుడు చాలా రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మనస్తాపం చెంది ఈనెల 9న కామారెడ్డి–ఉప్పల్‌వాయి స్టేషన్‌ల మధ్యలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

జార్ఖండ్ రాష్ట్రంలోని సింఘాడే తాలూకా గిర్ధ గ్రామానికి చెందిన రాజ్ కుమార్ బారీఖ్ (33) బతుకుదెరువుకోసం ఏడాది క్రితం సిద్దిపేట ప్రాంతానికి వచ్చాడు. గతనెల 28న కాలకృత్యాలు తీర్చుకునేందుకు రైలు పట్టాల అవతలి వైపు వెళ్లాడు. తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు పట్టాలపై పడిపోయాడు. అదే సమయంలో రైలు రావడంతో మృత్యువాత పడ్డాడు.

చర్యలు తీసుకుంటున్నాం



ప్రమాదాలు, ఆత్మహత్యలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. ఫెన్సింగ్ ఉంటే చాలా వరకు ప్రమాదాలను అరికట్టవచ్చు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– తావూనాయక్, ఎస్సై, కామారెడ్డి రైల్వే పోలీస్ స్టేషన్

క్లుప్తంగా

మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు



భిక్కనూరు : మండలంలోని లక్ష్మీదేవునిపల్లిలోని అంతన్నగారి కుంటలో మెదక్ జిల్లా తిమ్మాపూర్, లక్ష్మాపూర్, లక్ష్మీదేవునిపల్లి గ్రామాలకు చెందిన మత్స్యకార కుటుంబాలకు చెందిన వ్యక్తులకు వృత్తి నైపుణ్య పరీక్షలను సోమవారం నిర్వహించారు. మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వ నమోదు కోసం ఈ పరీక్షలను నిర్వమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వరదరెడ్డి, డైరెక్టర్ దాసరి నాగరాజు, సంగమేశ్వర్ మాజీ సర్పంచ్ నరేష్, సహకార సంఘాల అధికారులు రమేష్, శ్రీనివాస్, శ్వేతా, సురేష్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండలంలోని గాలీపూర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి, ఒడ్డెర సంఘం కమ్యూనిటి భవన నిర్మాణ పనులకు సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు భూమి పూజ నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ, ఒడ్డెర కాలనీల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేశారు. అలాగే ఒడ్డేర సంఘం భవనానికి రూ. 5 లక్షలు మంజూరు చేసి భూమిపూజ చేశారు. కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, రవీందర్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులున్నారు.

తాడ్వాయి ఎస్సైగా వెంకటేశ్వర్లు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి ఎస్ఐగా వీ.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. తాడ్వాయి ఎస్ఐగా పనిచేసిన ఆంజనేయులు బదీలిపై గాంధారి పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. సిరిసిల్లా జిల్లాలోని చెందుర్తి పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన వెంకటేశ్వర్లు తాడ్వాయికి బదిలీపై వచ్చారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ చంద్రమోహన్
- ప్రజావాణికి 65 వినతులు



వినతిపత్రం అందజేస్తున్న గోలిలింగాల గ్రామస్తులు



కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం : ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 65 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 27 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు చెందిన భూ సమస్యలే కావడం గమనార్హం. 10 డబుల్ బెడ్ రూం, 6 ఉపాధి కల్పన, 5 జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి సంబంధించినవి కాగా మిగితావి ఆయా శాఖలకు చెందిన దరఖాస్తులు నమోదయ్యాయి. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. జెడ్పీ సీఈవో చందర్, డీఆర్‌డీవో పద్మజా రాణి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, ఆయా శాఖల జిలా అధికారులు పాల్గొన్నారు.

మా గ్రామంలో టవర్ వద్దు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : తమ గ్రామంలో ఎయిర్‌టెల్ టవర్‌ను ఏర్పాటు చేయకూడదని కోరుతూ నాగిరెడ్డిపేట మండలంలోని గోలిలింగాల గ్రామానికి చెందిన కొంతమంది సోమవారం కామారెడ్డి జిల్లాకేంద్రంలో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు. తమ గ్రామ శివారులోగాని గ్రామకంఠ స్థలంలోగాని ఎయిర్‌టెల్ టవర్ నిర్మించేందుకు అనుమతిని తిరస్కరించాలన్నారు. ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందించిన వారిలో మాజీసర్పంచ్ మురళితో పాటు పలువురు ఉన్నారు.

పెంచిన వేతనాలు, పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

- మధ్యాహ్న భోజన కార్మికులు

పెంచిన వేతనాలు, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజావాణికి తరలివచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు సుధాకర్, చంద్రశేఖర్ మాట్లాడుతూ వంట కార్మికులకు బకాయి వేతనాలు, బిల్లులను చెల్లించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కేరళ రాష్ట్రంలో మాదిరిగా రోజుకు రూ.600 చొప్పున చెల్లించాలన్నారు. ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మొనూ చార్జీలను పెంచాలన్నారు. వంట కార్మికులకు ప్రతినెలా 5వ తేదీలోగా చెల్లింపులు జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం జిల్లా వైద్యశాఖ అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు రివ్యూ నిర్వహించారు. సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందుతాయన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి సాంఘిక సంక్షేమ శాఖ (సోషల్ వెల్ఫేర్) ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి మంజూరైన రూ. 2.5 లక్షల చొప్పున ముగ్గురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంరెడ్డి, హన్మాండ్లు, మురళీగౌడ్, కృష్ణారెడ్డి, వెంకట్ రెడ్డి, బల్‌రాం రెడ్డి, షేక్ నజీర్, కుమ్మరి రాములు తదితరులున్నారు.

సుద్దముక్కపై ఛత్రపతి శివాజీ రూపం



రాజంపేట : రాజంపేట మండల కేంద్రానికి చెందిన వడ్ల నాగభూషణం సోమవారం ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించకుని సుద్దముక్కపై ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని చెక్కారు. భూషణం గతంలో వరల్డ్ కప్, తెలంగాణ తల్లి విగ్రహం లాంటి ఎన్నో ప్రతిమలు ఆవిష్కరించి పలువురి మన్ననలు పొందారు.

ఉపాధి పనులు చేపట్టాలి



గాంధారి(ఎల్లారెడ్డి) : మండల పరిధిలోని గ్రామాల్లో గుర్తించి ఉపాధిహామీ పనులను పూర్తి చేయాలని, కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో రాజేశ్వర్ ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక స్త్రీశక్తి భవనంలో జీపీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షించారు. నర్సరీలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎంపీవో రాజ్‌కిరణ్ రెడ్డి, ఏపీవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను సక్సెస్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాణాల లక్ష్మారెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి) : విజయ సంకల్ప యాత్రలో భాగంగా ఈనెల 20 నుంచి చేపట్టే బస్సుయాత్రను సక్సెస్ చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు బాణాల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 17 పార్లమెంటు సీట్లు గెలవాలనే లక్ష్యంతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాదులోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు చేసి యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. 20వ తేదీ మంగళవారం నుంచి చేవెళ్ల, జహీరాబాద్, మెదక్, కరీంనగర్ క్లస్టర్‌లో బస్సుయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. బస్సుయాత్ర ద్వారా మోదీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే అయోధ్యలో రామమందిరం నిర్మించి చరిత్ర సృష్టించినట్లు తెలిపారు. మూడోసారి మోదీని పీఎం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాపురెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మహరాజుల మురళి, మండల అధ్యక్షుడు దత్తురాం, అశోక్, ఉదేశ్‌కుమార్, రాజారాం సాయిలు, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో కమీషన్ల కోసం కక్కుర్తి

- వందేళ్ల నిజాంసాగర్ ప్రాజెక్ట్ చెక్కు చెదరలేదు
- మూడేళ్లకు మేడిగడ్డ పిల్లర్లు కూలాయి
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కేసీఆర్ కుటుంబం కమిషన్ల కోసం కక్కుర్తి పడటంతో నిర్మాణ పనులు నాసిరకంగా జరిగాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆరోపించారు. వేలకోట్లు వెచ్చించి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ఆయకట్టుకు సాగునీరందించలేని పరిస్థితి నెలకొందన్నారు. సోమవారం మహమ్మద్‌నగర్ మండలంలోని తెల్గాపూర్, గిర్నితండా, గాలీపూర్, ముగ్దుంపూర్, మహమ్మద్‌నగర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాల అవిష్కరణ, పార్టీలో చేరిక కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వందేళ్ల కింద కట్టిన నిజాంసాగర్ ప్రాజెక్ట్ చెక్కుచెదరలేదని, మూడేళ్ల కిందట నిర్మించిన కాళేశ్వరం పిల్లర్లకు బీటలు పడ్డాయన్నారు. కాంగ్రెస్ గరీబోళ్ల పార్టీ అన్నారు. ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించినా వారిలో మార్పు రాలేదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదన్నారు. అర్హులందరికీ పథకాలు అందుతాయని, ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామన్నారు. వరుసగా మూడు పర్యాయాలు గెలిచిన మాజీ హన్మంత్ సింధే చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఒక్క మండల కేంద్రంలోనైనా సెంట్రల్ లైటింగ్ లేదని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు లేరన్నారు. దళిత బంధు, డబుల్ బెడ్రూం ఇళ్లల్లో అవినితికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మహమ్మద్‌నగర్ మండలం ఏర్పాటుతో తహసీల్ కార్యాలయం మాత్రం తీసుకొచ్చారన్నారు. మహమ్మద్‌నగర్ మండలానికి పోలీస్ స్టేషన్, ఎంపీడీవోతో పాటు అన్ని శాఖలకు ప్రభుత్వ భవనాలు నిర్మిస్తామని, సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయించి, ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్, రమేష్‌యాదవ్, లోక్యానాయక్, ఆకాష్, సవాయిసింగ్ తదితరులున్నారు. మహమ్మద్‌నగర్ మండలంలోని తెల్గాపూర్, గాలీపూర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ప్రజా సేవ చేసేందుకే వచ్చా..

- నా తండ్రిలాగే నన్ను ఆదరించండి
- యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్



మాట్లాడుతున్న ఇలియాస్

కామారెడ్డి టౌన్ : నా తండ్రి దారిలోనే ప్రజా సేవ చేయడానికి ముందుకొచ్చానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తనయుడు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాస్ అన్నారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటి సారిగా జిల్లాస్థాయి యువజన కాంగ్రెస్ సమీక్షా సమావేశాన్ని స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. తన తండ్రి షబ్బీర్‌ను ఆదరిస్తున్నట్లుగానే తనను ఆదరించాలని కోరారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే లక్ష్యమన్నారు. రాబోయే కాలంలో భర్తీ చేయాల్సిన నామినేటెడ్ పదవుల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్‌కు పెద్దపీట వేసి ప్రాధాన్యం ఇస్తానన్నారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్చార్జ్ ఖలీద్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మూర్తి గోపి, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ప్రతాప్ రెడ్డి, నాయకులు షేరు తదితరులున్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజమే



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఉద్యోగుల జీవితంలో బదిలీలు సహజమేనని నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్ సూచించారు. ఇటీవల బదిలీపై మెదక్ జిల్లాకు వెళ్లిన ఎంపీడీవో రఘుతోపాటు నాగిరెడ్డిపేట నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన పర్బన్నను, తహసీల్దార్ లక్ష్మణ్‌ను, ఇటీవల బదిలీపై భిక్కనూర్ మండలానికి వెళ్లిన గోలిలింగాల పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్‌ను సోమవారం వారు సత్కరించారు. ఎంపీడీవోగా రఘు, పంచాయతీ కార్యదర్శిగా మహేష్ గౌడ్ అందించిన సేవలు అభినందనీయమన్నారు. తహసీల్దార్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. పదోతరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతను సాధించడం లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు షేక్ ఫిర్దోస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సత్యానారాయణ, హెచ్ఎం హన్మారెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, సాగర్ తదితరులు ఉన్నారు.

తెయూ ఆర్ట్స్ డీన్‌గా లావణ్య



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్‌గా ప్రొఫెసర్ కరిమిండ్ల లావణ్య నియామకమయ్యారు. తెయూ ఇన్‌చార్జి వీసీ బుర్ర వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి సోమవారం లావణ్యకు నియామక ఉత్తర్వులు అందజేశారు. తెలుగు అధ్యయన శాఖ ప్రొఫెసర్ లావణ్య గతంలో బాలికల వసతి గృహ వార్డెన్‌గా, పరీక్షల అదనపు కంట్రోలర్‌గా, ఉమెన్ సెల్ డైరెక్టర్‌గా, పబ్లికేషన్ సెల్ కో-ఆర్డినేటర్‌గా, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా, తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులుగా, బీవోఎస్ చైర్మన్‌గా పనిచేశారు.

పేకాట స్థావరంపై దాడి

రుద్రూర్: కోటగిరిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వారి నుంచి రూ.12,300 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాల సీజ్

కామారెడ్డి క్రైం: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని దేవునిపల్లి ఎస్సై రాజు హెచ్చరించారు. దేవునిపల్లి హైస్కూల్ వద్ద సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీలను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్ లేని ఏడు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదంగా యువకుడి మృతి



టీటీపేట: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన జనగామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్, స్థానికులు తెలిపిన వివరాలు.. కోనాపూర్ గ్రామానికి చెందిన దుంపల రాజు (32) కూలీ పనులు చేసుకుంటూ ఉండేవాడు. మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన రాజు జనగామ శివారులో మృతి చెంది ఉండటాన్ని ఆదివారం సాయంత్రం పోలీసులు గుర్తించారు. మృతుడి మెడకు చిన్నతాడు ఉండి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. రాజు ఆత్మహత్య చేసుకున్నాడా మరేదైనా కారణమా అనేది విచారణ తర్వాత తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరు..

సదాశివనగర్: మండలంలోని కుప్రియాల్ శివారులో 44వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఓ ద్విచక్ర వాహనం అదుపు తప్పి డీవైడర్‌కు ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. గాంధారి మండలం చిన్న పోతంగల్ గ్రామానికి చెందిన పుప్పాల సంతోష్(27) కామారెడ్డి నుంచి పోతంగల్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా కుప్రియాల్ శివారులో డివైడర్‌ను ఢీకొన్నాడు. తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

రుద్రూర్: కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన కానూరి రాజశేఖర్ (35) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వర్నిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో విధులు నిర్వహించే రాజశేఖర్ గత నెల 31న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ నెల 16న నిజాంసాగర్ కాలువ పక్కన కాలిన గాయాలతో ఉన్న ఆయనను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాఘవేంద్రరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధర్మారం(బి) గ్రామానికి చెందిన మరొకరు..

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన షేక్ మాజీద్ (36) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. వివరాలు.. పిల్లలు కావడం లేదని ఈ నెల 15న మాజీద్ భార్యతో గొడవపడ్డాడు. అనంతరం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి అన్న జావేద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ..

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మహిళ మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం లింగాయపల్లిలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు.. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామానికి చెందిన కొంపల్లి సాయవ్వ (50) తన బంధువుల ఇంట్లో గృహ ప్రవేశం ఉందని సోమవారం లింగాయిపల్లికి వెళ్లింది. ఇంటి తలుపు దగ్గర ఉన్న ఓ విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురైంది. వెంటనే ఆమెను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికి చనిపోయింది. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా ఇద్దరు కుమారులు ఉన్నారు. దేవునిపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఆటో, బైక్ ఢీ

- ఒకరి పరిస్థితి విషమం
- మరో నలుగురికి గాయాలు



గాయపడిన ఆటోలోని ప్రయాణికులు



గాయపడ్డ ప్రదీప్

మోపాల్: నగర శివారులోని బోర్గాం(పి) వద్ద సోమవారం మధ్యాహ్నం ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్సై గంగాధర్ కథనం ప్రకారం.. బోర్గాం(పి) గ్రామానికి చెందిన దాయని ప్రదీప్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం మోపాల్ నుంచి బోర్గాం వైపు వస్తుండగా, అదే సమయంలో నిజామాబాద్ నుంచి మోపాల్ వైపు చిన్నాపూర్‌కు చెందిన జైపాల్ ఆటో వెళ్తుంది. బైక్ అదుపు తప్పి ఆటోను వేగంగా ఢీకొట్టడంతో ప్రదీప్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న మరో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రదీప్ పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించినట్లు తెలిసింది. ఆటో డ్రైవర్ జైపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళను కట్టేసి నగదు, బంగారం అపహరణ

- బాన్సువాడలో పట్టపగలు ఘటన

బాన్సువాడ: ఇంట్లోకి చొరబడి మహిళను కట్టేసి బంగారం, నగదు ఎత్తుకెళ్లిన ఘటన బాన్సువాడలో చోటు చేసుకుంది. బాన్సువాడ టౌన్ సీఐ కృష్ణ కథనం ప్రకారం.. పట్టణంలోని ఫిర్దోస్ కాలనీలో నివాసముంటున్న గౌసియా బేగం ఇంట్లోకి సోమవారం మధ్యాహ్నం ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి చొరబడ్డారు. వారు గౌసియా బేగంను కట్టేసి, అరవకుండా నోట్లో బట్ట పెట్టారు. అనంతరం బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.50 వేల నగదుతో పాటు అర తులం బంగారం ఎత్తుకెళ్లారు. ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు తనను చున్నీతో ఫ్యానుకు వేలాడదీశారని బాధితురాలు తెలిపినట్లు సీఐ చెప్పారు. దొంగలు పారిపోగానే నోట్లో ఉన్న బట్ట పడిపోవడంతో కేకలు వేయగా పక్కింటి ఇర్ఫానా బేగం వచ్చి తన మెడకు ఉన్న చున్నీని విప్పినట్లు బాధితురాలు చెప్పిందన్నారు. గౌసియా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పత్తిపంటను మేసిన గొర్రెలు మృతి

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం జీజీనడ్కుడలో పత్తి పంటను మేసి గొర్రెలు మృతి చెందాయి. బింగి గంగాధర్‌కు చెందిన గొర్రెలను వారం క్రితం మేతకోసం మహారాష్ట్రకు తీసుకెళ్లారు. మేత మేసిన గొర్రెల మంద తిరిగి ఇంటికి రాగానే ఒక్కొక్కటిగా మృతి చెందడం మొదలైంది. వరుసగా ఐదు గొర్రెలు చనిపోవడంతో పశుసంవర్ధక శాఖ అధికారి హన్మంత్ రెడ్డికి సమాచారం ఇచ్చాడు. సోమవారం జీజీ నడ్కుడకు వచ్చిన ఆయన చనిపోయిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. పత్తి పంటను మేయడంతో అది విషంగా మారి గొర్రెలు చనిపోతున్నాయని వెల్లడించారు. మేతకోసం మహారాష్ట్రకు ఎన్ని గొర్రెలు వెళ్లాయో ఆరా తీశారు. మొత్తం నాలుగువేల వరకు మేతకు వెళ్లగా, ఆహారం విషంగా మారకుండా మందులు రాసిచ్చినట్లు హన్మంత్ రెడ్డి తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

మాక్లూర్: మద్యానికి బానిసై చెరువులో పడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు సోమవారం తెలిపారు. వివరాలు.. నిజామాబాద్ నగరం 3వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే సుధాకర్ (27) జులాయిగా తిరిగేవాడు. తరుచూ మద్యానికి డబ్బు అడుగుతుండటంతో ఈ నెల 10న తల్లిదండ్రులు మందలించారు. అదే రోజు ఇంటి నుంచి వెళ్లిన సుధాకర్ తిరిగి ఇంటికి రాకపోవటంతో తల్లిదండ్రులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. సోమవారం మాక్లూర్ మండలం బోర్గాం (కె) చెరువులో మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి ప్రతాప్ ఫిర్యాదు మేరకు కేసు చేశామని ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: రుద్రూర్ మండలం సులేమాన్ ఫారం వద్ద సోమవారం రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్టు ఎస్సై మహేందర్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌లను పోలీస్‌స్టేషన్ తరలించి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం అందించామని చెప్పారు.

డ్రంకన్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం పట్టణ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టణానికి చెందిన గోపాల్ అనే వ్యక్తి డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని సోమవారం కోర్టుకు హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

కుక్కలను చంపిన వారిపై ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలం మచ్చర్లలో వీధికుక్కలను చంపిన వారిపై ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మేడ్చల్ జిల్లాకు చెందిన బ్రీత్ యానిమల్ రెస్క్యూ హోం వ్యవస్థాపకురాలు సరజ సాయిశ్రీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో 33 కుక్కలను విష ప్రయోగం చేసి చంపారని సరజ సాయిశ్రీ ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా మండల పశు సంవర్ధక శాఖ అధికారి లక్కం ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది మృతి చెందిన కుక్కలకు పోస్టుమార్టం నిర్వహించి పోలీసులకు నివేదిక అందజేశారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాత రాజంపేటకు చెందిన తల్లీ కొడుకులు అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన దేవకి మాలిక్, ఆమె రెండేళ్ల కుమారుడు జితేంద్ర మాలిక్ సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని భర్త చంద్ర మాలిక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.